# సెటప్

## మాగంటి రవీంద్రనాథ్

మన్మథరావుకి మనసంతా చికాగ్గా ఉంది. పొద్దునలేచిన దగ్గర్నుంచి ఒక్క పని కూడా అనుకున్నట్టుగా జరగలేదు. రివర్స్..ఎక్కడ చెయ్యి పెడితే అక్కడ రివర్స్!

ఎట్టి పరిస్థితుల్లోనూ అయిదుగంటలకల్లా ఆఫీసునుండి బయటపడి తీరాలని అయిదున్నరకల్లా బస్టాండ్‌కి చేరుకుని పుట్టింటికి వెళ్తున్న శ్రీమతికి సెండాఫ్ ఇవ్వాలని ఆరవైనాలుగు గంటల ముందుగానే గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఆ ప్రకారం ఆ సాయంత్రానికి వేరే కార్యక్రమాలేవీ లేకుండా ముందే జాగ్రత్త పడ్డాడు. అయినా అనుకోని అవాంతరం వచ్చిపడింది. మబ్బులేని వానలాగా శివరావుగాడు మిట్టమధ్యాహ్నం వూడిపడ్డాడు. ఆ వేళప్పుడు వాడు దర్శనమిచ్చాడంటే ఎక్కడో ఎమర్జెన్సీ సెటప్ సిద్ధంచేసొచ్చినట్టే లెక్క. సెటప్‌అంటూ ఏర్పాటవ్వాలేగాని ఇకదాన్ని తప్పించుకోవడం కల్ల. ఆఫీసర్‌కి మస్కాకొట్టి మధ్యాహ్నం రెండింటికే శివరావు స్కూటర్‌మీద ఉండవల్లి సెంటర్‌కి చెక్కేసాడు మన్మథరావు. భార్య ప్రయాణం సంగతి కృష్ణాబరాజ్ దాటుతుండగానే మర్చిపోయాడు.

ఆశగా ఆబగా సెటప్‌కెళ్తే అక్కడ అకస్మాత్తుగా చుక్కెదురైంది. ఏడుగంటలవరకు ఏమీ ప్రయోజనం లేకపోవడంతో ఇక చేసేదిలేక మిగతాపని శివరావుకి అప్పజెప్పి ఉసూరుమంటూ ఉండవల్లి సెంటర్‌లో గుంటూరు పాసింజర్‌కోసం నిలబడ్డాడు మన్మథరావు.

ఏనాడూ లేనిది ఇవాళ సెటప్ ఎందుకిలా దెబ్బతీసేసింది. దీనికోసం ఎన్నాళ్ళనుంచి ఏర్పాట్లు చేయిస్తున్నాడు! అంతా మూసీలో పోయిన పన్నీరైంది. అవలిలా జరుగుతుందనుకుంటే ఇటు ప్రక్కకే వచ్చుండేవాడు కాదు. ఎంచక్కా బస్టాండ్‌కు వెళ్ళి శ్రీమతికి సెండాఫ్ ఇచ్చుండేవాడు. అసలే అల్పసంతోషి. తనువెళ్తే ఎంత సంబరపడిపోయేదో!

ఈ నేపథ్యంలోనే — శ్రీమతి తల్లికి ఆరోగ్యంబాగాలేదని హైదరాబాద్‌నుంచి ఉత్తరం వస్తే మన్మధరావుకి వరం మీద వరం దొరికినట్టయింది. ఇక వారం పదిరోజులైనా ఏకధాటిగా''సెటప్''లునడిపించొచ్చని ఉబ్బితబ్బిబ్బయిపోయాడు.

మన్మథరావు మనసంతా శ్రీమతి నిండిపోయింది. మంగళగిరినుంచి బస్సులో ఎలా వచ్చిందో ఏమో? పాపం బెజవాడ బస్టాండ్‌లో తనకోసం ఎంతసేపు ఎదురుచూసిందో? ఎంత డిసప్పాయింటై పోయిందో మరి!

భార్యకు సెండాఫ్ ఇవ్వలేకపోవడంకంటే ఆమె ఒంటరిగా హైదరాబాద్ వెళ్ళడమే మన్మథరావుకి బాగా బెంగపుట్టించేస్తోంది. పక్కసీట్లో ఎవరున్నారో! వెనకముందు ఎట్లాంటి మగాళ్ళు కుర్చున్నారో! దిల్‌సుక్‌నగర్ రాగానే గుర్తుపెట్టుకుని దిగుతుందో లేదో! ఒకవేళ అక్కడ దిగడంమర్చిపోతే. మళ్ళీ నల్లగొండ చౌరస్తాదాకా బస్సుఆగదు. అసలే పిచ్చిమొద్దు. ఎలా వెళ్తుందో ఏమో? క్షేమంగా చేరినట్టు ఉత్తరం వచ్చేదాకా మనశ్శాంతి ఉండేట్టులేదు.

శ్రీమతితోపాటు తనుకూడా వెళ్తే అసలీ ఆందోళనవే ఉండేదికాదు. కానీ ఎలా వెళ్ళగలడు. ఏ నిముషంలో ఏ సెటప్ రెడీ అవుతుందో తెలియదు మరి. ఒక సెటప్ మిస్సయితే మళ్ళీ జీవితకాలంలో ఆ నష్టం పూడ్చుకోవడం సాధ్యంకాదు. అందుకే సెలవు దొరకలేదని నమ్మించి శ్రీమతిని మాత్రమే హైదరాబాద్ పంపించక తప్పలేదు.

మన్మథరావుకి అంతర్మథనం ఎక్కువై పోయింది. అప్పటికి అతను ఉండవల్లి సెంటర్‌లో నిలబడి అర్థగంట దాటిపోయింది. అన్నీ లాంగ్‌రూట్ బస్సులు, నాన్‌స్టాప్‌లు. పాసింజర్ జాడలేదు. వెళ్ళాల్సింది మంగళగిరివరకే కనుక ఏ లారీలో ఎక్కినా పదిహేను నిముషాల్లో చేరుకోవచ్చు. కానీ ప్రొద్దుటినుంచి ఎడమ కన్ను అదేపనిగా అదురుతోంది. సెంటిమెంట్లు బాగానమ్మటబట్టిన మనిషి కనుక లారీని ఆపే ప్రయత్నం చేయడంలేదు.

సెంటిమెంట్ల ఆలోచన రాగానే ఉదయం జరిగిన సంఘటన గుర్తుకొచ్చేసింది మన్మథరావుకి.

ప్రొద్దున పక్కమంచం మీదనుంచి లేవడంతోనే మన్మథరావు సెంటిమెంట్ ఘోరంగా దెబ్బతీసేసింది. లేచీలేవగానే శ్రీమతి ముఖంలో ముఖంపెట్టి కళ్ళు విప్పడం ఆమె కళ్ళమీద కమ్మగా ముద్దు పెట్టుకోవడం, ఆ తర్వాత ఆమె అతని గుండెల్లో గువ్వలా వొదిగిపోవడం వాళ్ళ పెళ్ళయిన దగ్గర్నుంచి వస్తున్న అలవాటు. అటువంటిది ఇవాళ మన్మథరావు కళ్ళు తెరిచేసరికి పక్కలో శ్రీమతి బదులు జాలీ కనిపించడంతో ఖంగారుగా మంచంమీదనుంచి దూకేశాడు మన్మథరావు. అతని తత్తరపాటును అప్పుడే బాత్‌రూమ్‌నుంచి వస్తున్న శ్రీమతి ముసిముసిగా నవ్వుకుంది.

శ్రీమతి లోలోపల అలా నవ్వుకున్నదన్నమాటేగాని మన్మథరావు తన ముఖం చూడనిదే మంచం దిగడన్న సత్యం గుర్తొచ్చినప్పుడల్లా ఆమెకు కించిత్తు గర్వం కలుగుతుంటుంది. "సిరీ నువ్వొచ్చిన తర్వాతే నా జీవితం మారిపోయింది. నీవల్లే నాకింత కలిసొచ్చింది. నువ్వు నా బ్రతుకుని వెలిగించిన దేవతవి. నా నట్టింట్లో నడయాడే లక్ష్మీదేవివి" అంటూ మన్మథరావు తనని దగ్గరకు తీసుకున్నప్పుడు ఆమెకి ప్రపంచాన్ని జయించినంత గర్వం కలుగుతుంది.

మంగళగిరిలో ఉద్యోగంచేస్తుండగా మన్మథరావుకి పెళ్ళయింది. నాలుగేళ్ళు హాయిగా గడిచిందోలేదో అతడిని మళ్ళీ బెజవాడకి ట్రాన్స్‌ఫర్ చేశారు. మంగళగిరి వాతావరణానికి బాగా అలవాటుపడిపోయిన శ్రీమతి బెజవాడకు కాపురం మార్చడానికి ఆసక్తి చూపలేదు. ఇలాంటి ఛాన్సుకోసంఎదురుచూస్తున్న మన్మథరావు తాను రోజూ బస్సులో బెజవాడ వెళ్ళొస్తానన్నాడు. భర్త ఔదార్యానికి మురిసిపోయింది శ్రీమతి. భార్య సంతోషంకోసం ఏదైనాసరే చేయగల భర్త దొరకడం తన పూర్వజన్మ సుకృతమనుకుంది.

రోజూ బెజవాడ వెళ్ళిరావడంవల్ల మన్మథరావుకి కావలసినంత స్వేచ్ఛ దొరికింది. పెళ్ళయిన దగ్గర్నుంచి బలవంతాన కట్టేసిన కోరికలపగ్గం నెమ్మదిగా విప్పుకున్నాడు. శివరావులాంటి ఆత్మీయమిత్రుల్ని అతికొద్ది కాలంలోనే సంపాదించుకున్నాడు. మిత్రబృందమంతా వారానికో రెండువారాలకో ఎక్కడో ఒకచోట సెటప్ ఏర్పాటుచేసుకోవడం, మందు, మగువల్తో కాలక్షేపం చెయ్యడం పరిపాటైపోయింది.

ఈ నేపథ్యంలోనే శ్రీమతి తల్లికి ఆరోగ్యం బాగాలేదని హైదరాబాద్‌నుంచి ఉత్తరంవస్తే మన్మథరావుకి వరంమీద వరం దొరికినట్టయింది. ఇక వారం పదిరోజులైనా ఏకధాటిగా సెటప్‌లు నడిపించొచ్చని ఉబ్బితబ్బిబ్బయిపోయాడు.

కానీ ఇవాళ మొదటి "సెటప్పే" ఘోరంగా విఫలమైంది. శివరావుగాడు లేనిపోని ఆర్భాటం ఏంచేశాడో ఏమోగాని వాడి ఇంటి యజమానికి అనుమానం వచ్చి కాపలా కూర్చున్నాడు. దానితో రావాల్సిన చుక్క రావడమే కుదర్లేదు. ఎంతసేపు చూసినా హౌస్‌ఓనర్ కదిలేసూచన లేకపోవడంతో ఇక తప్పనిసరై ప్రోగ్రాంని పోస్టుపోన్‌చేసి ఏ అర్ధరాత్రి అయినా సరే సరాసరి మంగళగిరికి తీసుకొచ్చెయ్యమని శివరావుకి పని పురమాయించాడు మన్మథరావు.

రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో ఎట్టకేలకు మన్మథరావుకి ఉండవల్లి సెంటర్‌లో గుంటూరు పాసింజర్ బస్సులోకి ప్రవేశం దొరికింది. బస్సులో ఏ





రెండువందలమంది ఉన్నారో అన్నట్టుగా ఉంది. అతి కష్టంమీద ఫుట్‌బోర్డుమీద ఉన్న వాళ్ళని తోసుకుని లోపలికి చేరుకున్నాడు మన్మథరావు. మంగళగిరికి టిక్కెట్లు తీసుకున్నాడు. బస్సు భారంగా బయల్దేరింది.

మనిషిమీద మనిషి. చెమట వాసన. మాటలు, అరుపులు, గందరగోళం.

బస్సు తాడేపల్లి ఆయిల్స్ కంపెనీని దాటు తుండగానే లోపల చిటుక్కున లైట్లారిపోయాయి. డ్రైవర్ బస్సుని పక్కకితోసి ఆపేశాడు. "ఏం గురూ, లైట్స్ ఫెయిల్. ఏం చేద్దాం?" మంగళగిరదాకా లాగించు భాయ్. అక్కడ చూసుకుందాం. డ్రైవర్ ప్రశ్నకు కండక్టర్ ఇచ్చిన జవాబుతో హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నాడు మన్మథరావు. అప్పుడు తగిలింది అతని శరీరానికి ఎదుటెనుంచి మెత్తనిస్పర్శ. నిలువెల్లా పూ లతో తడిమినట్టుగా ఉంది.

చీకట్లో నిశితంగా ముందుకి చూశాడు మన్మథరావు. ఎదురుగా ఒక స్త్రీ ఆకారం. ఆమె వీపు తన ఛాతికి రుద్దుకుంటూ ఆమె నడుము తన కాళ్ళని ఢీకొంటూ దాదాపు తనకి అంటుకుపోయినట్టుగా నిలబడి ఉంది. తన ముక్కుకి దగ్గరగా ఉన్న ఆమె సిగనుంచి సంపెంగ పువ్వు లీలగా కనిపిస్తోంది. ఇంతసేపూ ఆమెని ఆ స్పర్శని గుర్తించలేకపోయినందుకు మన్మథరావు తనను తానే తిట్టుకున్నాడు.

అసలే బస్సంతా ఇరుకుగా ఉంది. పైగా చిమ్మచీకటి. ధయిర్యంగా మరికాస్త ముందుకు జరిగాడు మన్మథరావు. అతడి శరీరం వెనకనుంచి ఆమె వంపులకి మరింత దగ్గరైంది. దానితో ఆమెలో స్వల్పంగా కదలిక కనిపించింది. కాస్తముందుకు తిరగడానికి ప్రయత్నించింది. ఇటువంటి వాటిలో ఆరితేరిన మన్మథరావు తను మరికాస్త ముందుకు జరిగి ఆమెను మరింతగా ఒత్తుకుంటూ నిలబడ్డాడు. ఇక ఆమె ముందుకు జరిగే ప్రయత్నం చేయలేదు. "ఇదేదో పెద్దకేసైనా అయివుండాలి. లేదాగొడవ చేసుకోవడం ఇష్టంలేని గొప్పింటి పిల్లయినా అయిఉండాలి" అనే డెసిషన్‌కి వచ్చేశాడు మన్మథరావు. వంటికి వళ్ళు ఒత్తుకోవడంతోపాటు చేతికి కూడా పని చెప్పసాగాడు. ఆమె అటుఇటు కదులుతోంది. అయినా వెనక్కితిరగడంలేదు. ప్రతిఘటించడంలేదు. అది అలుసుగా తీసుకుని మన్మథరావు ఆ కుదుపుల బస్సులో ఆమె శరీనాన్ని వెనకనుంచి పూర్తిగా ఆక్రమించుకుని ఆబగా ఒత్తుకుంటున్నాడు.

"శివరావుగాడు రాత్రికి శాల్తీని తెస్తాడోలేడో? బస్సు దిగగానే ఈ కేసుని సరిచేసుకుంటే సరిపోతుంది" అనుకున్నాడు మన్మథరావు.

బస్సు మంగళగిరి ఊళ్లోకొచ్చింది. వీధిలైట్ల వెలుగులోపల పడుతుండడంతో మన్మథరావు ఆమెను నెమ్మదిగా దాటి మందుకు నడిచాడు.

"ఏవండోయ్ ఆగండి చెవిలో గొణిగింది ఆ స్త్రీ. ఠక్కున ఆగిపోయాడు మన్మథరావు. "ఇప్పటిదాకా ఏం ఎరుగనట్టు వెనకచేరి ఇప్పుడలా దిగిపోతే ఊరుకుంటానా? సామాను కూడా మీరే దించండి"- ఆమె మాటలతో ముఖంలోకి పరికించి చూసిన మన్మథరావుకి ఆ బస్సు భూమిలోకి దిగిపోతున్నట్టు అనిపించింది. "సిరీ.. శ్రీమతి.." అంటూ గొణిగాడు. "నేను బస్సెక్కబోయే వేళకు అమ్మ హైదరాబాద్‌నుంచి దిగిందండీ..." ఆమె చెప్పే మాటలేవీ అతనికి విన్పించలేదు.